# ఓటమి

ప్రొద్దున్నే భుజంగరావుగారు స్నానం, జపం చేసి వరండాలో కుర్చీ మీద కూర్చొని భగవద్గీత చదువుకొంటున్నారు. అంతలోనే బావమరిది మాధవయ్య త్రాగుతున్న చుట్టను గోడవతల పారవేసి వచ్చి, భుజంగరావుగారి ప్రక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు. భుజంగరావుగారు మౌనంగా చదువుకొంటూనే ఉండి పోయారు.

కొద్ది క్షణాల తరువాత మాధవయ్యే మొదలు పెట్టాడు - "పొలం పోయేవాడిని, మీతో మాట్లాడదామని ఇలా వచ్చాను బావా!" అంటూ.

చదువుతున్న శ్లోకం ముగించి 'ఏమిటి' అన్నట్లు చూచారు భుజంగరావుగారు.

మాధవయ్య నలభయ్యవ పడిలో పడినా బావ భుజంగరావుగారితో మాట్లా డటమంటే కొంచెం బిడియమే. కారణం అతనికి బావగారి యెడల గల గౌరవ ప్రపత్తులలాంటివి.

"అదే... మురారి ఎలక్షనులో నిలబడతానంటే వద్దన్నావట..... వాడు మాత్రం ఏమన్నా ఉద్యోగం చేయాలా, మరేమన్నానా? ఏదో ఇంత ప్రజాసేవ చేస్తానని ఉత్సాహ పడుతున్నాడు. కాదనటం ఎందుకు? పైగా వాడే నిలబడాలి కాని, గ్రామం గ్రామం వాడికి కిరీటం పెట్టదూ...." అన్నాడు మాధవయ్య.

భుజంగరావుగారు గంభీరంగా ఉండిపోయారు.

"అది కాదు బావా! వాడూ ఇంత చదువుకున్నవాడు. జ్ఞానాన్ని ఆర్జించినవాడు. అలాంటివాడికి ప్రోత్సాహమిస్తే పైకి వెళతాడు....." అన్నాడు మళ్ళీ మాధవయ్య.



భుజంగరావుగారు సూటిగా మాధవయ్య కళ్లలోనికి చూచారు. ఆ చూపులో ఏ భావముందో మాధవయ్యకు బోధపడలేదు. అంగీకారము, అనంగీకారము ఏదీ తెలియ పరచని భుజంగరావుగారు మళ్ళీ గీతాపారాయణంలో మునిగిపోయారు.

"వస్తాను. పొలలో పని మనుషులను వంగించి వచ్చాను" అంటూ మాధవయ్య వెళ్ళిపోయాడు.

భుజంగరావుగారు పుసులూరు గ్రామంలో మోతుబరి. చదువు, సంస్కారం గల వ్యక్తి. ఆనాడు స్వాతంత్ర్యోద్యమంలో, గాంధీ మహాశయుని శంఖారావం విని దేశం కోసం నడుము కట్టిన త్యాగి. జాతీయ కళాశాలలో విద్యాభ్యాసం చేస్తూ దేశం పిలిచిందంటూ ప్రాణాలొడ్డటానికి సాహసించిన దేశభక్తుడు.

దేశం స్వాతంత్ర్యాన్ని పొందాక రాజకీయ జీవితానికి స్వస్తి చెప్పి, వ్యవసాయం చేయించుకొంటూ పుసులూరులోనే నివాసం ఉండిపోయారు. ఆ గ్రామంలో భుజంగరావుగారంటే అమిత గౌరవం, భక్తి ప్రపత్తులు ఉండేవి. ఆయన మహా జ్ఞానిగా పరిగణింపబడ్డారు.

మురారి భుజంగరావుగారి ఏకైక సంతానం. విశాఖపట్టణంలో పట్టభద్రుడై సెలవులకు పుసులూరు చేరాడు. కళాశాల జీవితంలో కొద్దిగా రాజకీయ వాసనల చుట్టూ మసలిన వాడే! బి.ఏ. చదువుతూ ఉండగా విద్యార్థి సంఘానికి అధ్యక్షుడుగా ఎన్నిక అయ్యాడు.

పుసులూరు వచ్చాక ఒంటరిగా ఉండటానికి ఏదోగా ఉండేది. పై చదువుకు వెడదామని అనుకొన్నాడు. కాని, భుజంగరావుగారు కుటుంబ బాధ్యతలను తాను మోయలేదని, ఇంటి పట్టున ఉండి మురారినీ చూచుకోమని చెప్పారు. పైగా దేశంలో ఉద్యోగాలు చేసికొని బ్రదుక వలసిన వారు చాల మంది ఉన్నారు, వారికి ఉద్యోగాలు కాని, నీ కెందుకని ప్రశ్నించారు కూడ. పట్టణ జీవితానికి అలవాటు పడిన మురారి, "పల్లె జీవితమా!" అనుకొన్నా, తండ్రి మాట కాదన లేకపోయాడు.

కొంతకాలం అలా గడిచే సరికి పుసులూరులో నలుగురూ తన దగ్గరకు రావటం, మంచి, చెడ్డా, రాజకీయాలూ కనుక్కోవటం ప్రారంభించారు. దానితో గ్రామ ప్రజలకు నాయకుడై వారినందరినీ ఎందుకు ముందుకు తీసికొని రాకూడదు అనిపించింది మురారికి.

మునసబు రంగయ్య ఆ మధ్య భుజంగరావు గారితో మాట్లాడుతూ, "ఈ పల్లె ప్రజలేనాటికి పురోగమిస్తారు? తమ మీద ఉన్న ప్రజాస్వామ్య భారాన్ని ఏ నాటికి గుర్తిస్తారు? మన మురారి లాంటి యువకులు ముందుకు వచ్చి నడుం

కట్టకపోతే ఎలాగు?" అన్నారు మాటల సందర్భంలో. మురారి తన ఆలోచనలను ఆనాటి నుండి ఈ మార్గంలో ప్రసరింపచేశాడు. తాను గ్రామ పంచాయతీకి అధ్యక్షుడై పంచాయతీ సమితితో పోరాడి తన గ్రామానికి తగిన వసతులు కల్పించాలి.

ఆరు నెలలు తిరగకముందే గ్రామ పంచాయతీ ఎన్నికలు వచ్చాయి. నలుగురూ ప్రోత్సహించారు. మురారి సర్వ సన్నద్ధుడైనాడు. కాని భుజంగరావు గారి అనుమతి కావాలి. మురారికి భుజంగరావుగారి దగ్గరకు వెళ్ళి మాట్లాడగల ధైర్యం, చనువు లేవు. అందుకే తల్లి జానకమ్మగారి చేత చెప్పించి చూచాడు.

"ప్రజాసేవ వాడికేం చేతనవుతుంది?" అనేసి చదువుతున్న పుస్తకంలో మునిగిపోయారు భుజంగరావుగారు.

ప్రక్కగదిలో ఉండి వింటున్న మురారి మనస్సు చివుక్కుమంది. తన తండ్రి మీద ఉన్న భావం క్షణకాలం తొట్రుపడిది. ఏమైనా సరే పంచాయతీ ఎన్నికలకు నిలబడవలసిందే అని నిర్ణయించుకొన్నాడు. జానకమ్మగారు, ఆ గ్రామంలోనే ఉన్న తన అన్నగారు మాధవయ్య దగ్గరకు వెళ్ళి, మురారి కోరిక, భుజంగరావుగారి అభిప్రాయం చెప్పింది.

★ ★ ★

ఆనాడు అలా మాధవయ్య, భుజంగరావు దగ్గర ఆ విషయం ప్రస్తావించి, మరునాడు మరికొందరిచేత చెప్పించాడు.

"కుర్రవాడు, వాడికేం చేతనవుతుంది? మీలో ఎవరైనా పెద్దలు స్వీకరించాలి ఆ బాధ్యతను"- అన్నారు భుజంగరావుగారు.

"కాదు, మురారే తగిన వ్యక్తి" అంటూ వాదించారు కరణం భద్రయ్యగారు, మునసబు రంగయ్యగారు. వారికి అండగా గ్రామంలో మరికొందరు ప్రముఖులు నిలబడి మాట్లాడారు.

"మీ ఇష్టం" అనేసి ఊరుకొన్నారు భుజంగరావు. అంతే! అక్కడ చేరిన వారంతా మురారి ఆ గ్రామానికి ఏకైక నాయకుడన్నారు. ఆ గ్రామాన్ని ఎలా అభివృద్ధి పొందించాలో సూచించారు కొందరు. మరికొందరు పఠనాలయం,

రేడియో, పంచాయతీ కార్యాలయం ఎక్కడ ఉండాలో విశదపరిచారు. మురారి నిలువెల్లా పొంగిపోయాడు, తన ప్రజా జీవితం భవిష్యత్తులో ఎలా సాగిపోవాలో ఊహించుకొని.

★ ★ ★

ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా అర్థం చేసికోని దేశాలలో 'ఎన్నికలు' గాలివాట్లు. ఈనాటి సాయంత్రం మురారి ఏకైక నాయకుడన్నారు. తెల్లవారేసరికి... ఎక్కడో, ఏదో బయలుదేరి, గాలిపాటుకు 'ఎర'యై మరో పార్టీ లేచింది. కొన్ని సంవత్సరాలుగా ఆ గ్రామంలో పార్టీలు లేవు. అలాంటిది మరో పార్టీ ఉదయించింది.

ఎంతటి కోమల హృదయాలైనా రాజకీయాలలో పడేసరికి ఎంత విచిత్రంగా మారిపోతాయో! మురారిలో పట్టుదల ఎక్కువయింది. తానే ఎన్నిక కావాలనే తృష్ణలో పడిపోయాడు.

ఎన్నికల ప్రచారాలు తీవ్రంగా కొనసాగాయి. ఇరు పక్షాల నుండి కాగితాలు, లౌడు స్పీకర్లు, ఏవేవో...

భుజంగరావుగారు అరవయి ఏళ్ళ జీవితాన్ని గౌరవంగా గడిపారు ఈ సీమలో. ఏనాడూ ఆయనకు ఎదురాడిన వ్యక్తిలేడా గ్రామంలో. అలాంటిది మురారి మూలంగా గ్రామ పార్టీలు, కక్షలు ఉద్భవించటం భుజంగరావుగారి కెలాంటి మనసాపాన్ని కల్గించాయో? ఏమో... ఎవరికి తెలుసు? ఆ గంభీరమూర్తిలో ఎలాంటి భావాలూ పొడచూపవు. ప్రాతః ఉషస్సులో లేచి, భగవద్ధ్యానం చేసుకొని, చేతిలో పుస్తకంతో ఊరి వెలుపల తోట పొలంలో రెండు పెదచింతల మధ్య కూర్చొనటం తప్ప, ఆయన మరే విషయాలూ పట్టించుకోవటం లేదు.

మాధవయ్య, మునసబు రంగయ్యగారు, కరణం భద్రయ్యగారు ముగ్గురూ వచ్చి, భుజంగరావుగారిని ఒక్కటి అర్థించారు-

"మీరు ఆ ప్రత్యర్థిని పిలిపించి మానుకొనమని చెప్పండి. మానుకొంటాడు. మీ ముందర పడిన తరువాత తప్పించుకోలేడు. మీరంటే గౌరవం అతనికి" అని.

భుజంగరావుగారు పొడిగా నవ్వారు.

"నాకున్న విలువను వెలబెట్టి, ప్రజలు నిర్ణయించవలసిన దానిని నన్ను

నిర్ణయించమంటారా? తప్పు-" అన్నారాయన.

మురారి మనస్సు చివుక్కుమంది. తన తండ్రి రాజకీయవాది అని విన్నాడు. 'ఇదేనా ఆయన రాజకీయం.....' అనే తేలిక భావం పొరలింది అతని మనసులో.

★ ★ ★

ఎన్నికలు వచ్చాయి. ఇరుపక్షాలు ఎంతో ధనాన్ని, కాలాన్ని వెచ్చించాయి. ఎన్నికలు జరిగిపోయాయి. మురారి కొద్ది తేడాతో ఓడిపోయాడు. మునసబు రంగయ్యగారు, కరణం భద్రయ్యగారు, మాధవయ్య ఇండ్లలోనుండి బయటకే రాలేకపోయారు.

మురారి అవమాన భారంతో క్రుంగిపోయాడు. దీనికంతకూ కారణం తన తండ్రే అనిపించింది. తనకన్నా ఆ ప్రత్యర్థి ఏ విషయంలోనూ ఆధిక్యం కలిగి కాదు గెల్చింది. తన తండ్రి ఏమాత్రం మాట సహాయం చేసినా తనకీ ఓటమి కలిగేది కాదు. మురారికి భుజంగరావుగారి మీద పట్టరాని కోపం వచ్చింది. తన భవిష్యత్తును ఇలా నాశనం చేసిన తండ్రి నుండి వేరైపోవటమే మేలనిపించింది. వెంటనే బయలుదేరాడు. వెళ్ళిపోతూ ఒక్కసారి ఆయనతో చెప్పిపోవాలనుకొని, పొలంకేసి నడిచాడు.

సాయంత్రం కావస్తున్నది. పశ్చిమాన సూర్యుడు తన తీవ్రతను తగ్గించుకొని, సంధ్యకోసం ఎదురు చూస్తున్నాడు.

తోట పొలంలో రెండు చింతల మధ్య నీడలో కూర్చుని తదేక ధ్యాసతో గీతా పారాయణం చేస్తున్న భుజంగరావుగారిని చూడగానే మురారి క్షణకాలం నిరుత్తరు డయ్యాడు. ఏ భావాన్నీ పైకి ప్రదర్శించలేక, "వెళ్ళిపోతున్నాను" అన్నాడు.

కొన్ని క్షణాలు మౌనంగా గడిచిపోయాయి. భుజంగరావుగారు, చేతిలోని పుస్తకాన్ని ప్రక్కన పెట్టి మురారిని సూటిగా చూచి, "మురారీ! ఓడిపోయానని పారిపోతున్నావా....?" అన్నారు. ఆ పలుకులు ఎంతో గంభీరంగా ధ్వనించాయి. మురారి మారు మాటాడలేకపోయాడు.

పొడిగా నవ్వారు భుజంగరావుగారు.

"ప్రజాసేవ చేస్తానన్నావు.....? ప్రజాసేవ అంటే పదవి కాదు. అధికార తృష్ణ

అంతకన్నా కాదు నాయనా? ఒక్కసారి వెనక్కి తిరిగి చూడు, మన జాతిపిత నడిపిన ఉద్యమాన్ని.

"అరెస్టులు చేస్తామంటే లక్షలు వచ్చారు. కాల్పులు జరుపుతామంటే కోట్లు కదిలారు. మాన ప్రాణాలను త్యాగం చేశారు దేశం కోసం - ప్రజాసేవకోసం. వారు ఏ పదవులను ఆశించి, ఏ భోగాలను దృష్టిలో పెట్టుకొని చేశారంటా వీ త్యాగాలను? వారి ఆశయాలు, ఆదర్శాలు, నిష్కామన ప్రజాసేవంలో జీవ మందాయి. పవిత్రమైన చిత్తశుద్ధి వారికి మనుగడగా నిల్చింది. ప్రతి ఫలం వాంఛించని ప్రజాసేవకు వారి జీవితాలు అంకితాలయ్యాయి.

"మురారీ, వారితో ఒక్కసారి పోల్చి చూచుకో. నీ వెక్కడ ఉన్నావో శోధన చేసుకో. నీకు పదవితో పనిలేదు. ప్రజాసేవ నిష్కామంగా ఆచరించు. ప్రతి ఫలంగా, ధన సంపదలనే కాదు - కీర్తిని కూడ ఆశించకు. ఆనాడు నీవు ఉత్తమ ప్రజాసేవకుడవు కాగలవు. ఓటమి అంటే ఏమిటో నీకు కన్పించదు.

"సత్యం, ధర్మం, కరుణ ఇవి భగవంతుని రూపాలు. వీటిముందు, కాంతి ముందు ఓడిపోయే చీకటిలోని 'ఓటమి' ఓడిపోతుంది" - భుజంగరావు లేచి వెళ్ళిపోయారు.

మురారితో ఏదో సంచలనం బయలు దేరింది. శరీరంలో ప్రతి అణువూ కదిలినట్లైంది. హృదయం తేలికయింది.

గాలికి రెప రెప లాడుతున్న గీతను, చేతిలోనికి తీసికొన్నాడు మురారి.

మురారి "నే ఓడిపోను-" అని గొణుక్కుంటూ గృహోన్ముఖుడయ్యాడు.

●

★ *(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 6-6-1962)* ★